చేనేతలకు అండగా ఉంటాం



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తదితరులు



కార్మికురాలు సావిత్రితో మగ్గం పనిపై ఆరా తీస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: చేనేత కుటుంబాలను ఆదుకొని వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 5, 6వ వార్డుల్లో చేనేత కార్మికుల ఇళ్ల వద్దకు వెళ్లి మగ్గం ద్వారా చీరలు నేసే పనిని పరిశీలించారు. చేనేత కార్మికుల ఆర్థిక, కుటుంబ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేనేత కార్మికులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి వారి సమస్యలపై ఆరా తీశారు. రెండు నెలల నుంచి మూడు నెలల వరకు 3 చీరలు నేస్తామని వాటి ముడి సరుకులు మాస్టర్ వీవర్స్ ద్వారా తెచ్చుకొంటామని, చీరలు నేసి ఇస్తే రూ.6 వేల వరకు ఇస్తారని చేనేతలు వారికి తెలిపారు. అయితే ప్రభుత్వమే పట్టు చీరల ముడి సరుకు ఇచ్చి నేసిన తరువాత వాటినే ప్రభుత్వమే కొనుగోలు చేస్తే తమకు లాభం ఉంటుందన్నారు. అదేవిధంగా ఒకే ఇంట్లో రెండు కుటుంబాలు మగ్గాలు నేస్తే వారిలో ఒకరికే నేతన్న నేస్తం పథకం వర్తింపజేస్తున్నారని దీంతో తాము నష్టపోతున్నామని తెలిపారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, నేత పనికి పూర్వవైభవం కల్పిస్తామని వారు హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వార్డు కౌన్సిలర్లు అమాన్, శివప్రసాద్, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ నాయకులు బుట్టా రంగయ్య, వీరేంద్ర, వినయ్, వినయ్‌కుమార్ రెడ్డి, షాబుద్దీన్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నందవరంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పర్యటన

నందవరం: మండలంలో మంగళవారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని శివారెడ్డిగౌడ్ స్వగృహంలో వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే చేతులమీదుగా మంగళవారం గురజాల, నాగలదిన్నె గ్రామాల్లో నూతన గ్రామ సచివాలయాల భవనాల ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. అనంతరం ముగతిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం ఉంటుందని తెలిపారు. అలాగే పూలచింత గ్రామంలో పర్యటించనున్నట్లు వివరించారు. పార్టీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు తప్పకుండా హాజరు కావాలన్నారు.

13న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం

పత్తికొండటౌన్: పత్తికొండ పట్టణం టీటీడీ కళ్యాణ మంటపంలో ఈనెల 13వ తేదీ బుధవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.కవిత తెలిపారు. సోమవారం సాయంత్రం ఎంపీడీఓ మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన హాజరవుతారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా జిల్లా కలెక్టర్‌ను కలసి తెలియజేయవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

'స్కిల్' నిధులు రికవరీ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: స్కిల్‌డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్లు పక్కదారి పట్టించిన నిందితుల నుంచి వాటిని రికవరీ చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి మాల నరసన్న డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోట్లాది రూపాయల కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు భాగస్వామి కావడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ వర్గీకరణలో విభేదాలు సృష్టించిన వ్యక్తి కూడా చంద్రబాబే అని ఆరోపించారు. మాలమహానాడు నాయకులు మహానంది, ఎద్దుల చెన్నయ్య, నాగేంద్ర, సిద్ధరాముడు, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న లక్ష్మీనరసింహ స్వామి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఏటా శ్రావణ మాసంలో ఈ ఆలయంలో నెలరోజుల పాటు ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం తరహాలోనే లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుంటున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవదాయ శాఖ ఏర్పాట్లు చేశారు.

15లోపు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి

మద్దికెర: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈనెల 15వ తేదీలోగా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ రవి సూచించారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వ్యవసాయాధికారులు రైతుల పొలాలకు వచ్చి ఎంత విస్తీర్ణంలో ఏఏ పంటలు సాగు చేశారో నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు.ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే పంటల బీమా, రైతు భరోసా, రాయితీ విత్తనాలు, ఎరువులు పొందవచ్చన్నారు. రైతులు స్థానిక ఆర్బీకేల్లోని అధికారులను ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. వీఏఏలు జాకీర్, ఆనంద్, రాణి తదితరులు ఉన్నారు.

శరవేగంగా నిర్మాణాలు



హంపలో తుది దశలో సచివాలయం



బురుజులలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

మద్దికెర: మండలంలోని హంప, బురుజుల గ్రామాలలో సచివాలయం, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. నిర్మాణాలు పూర్తి చేసి భవనాలను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. త్వరలోనే ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్‌రెడ్డి, హంప ఉప సర్పంచ్ తిమ్మప్ప తెలిపారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపిక పోటీలు

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 14, 15 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు మండల క్రీడా కన్వీనర్ పాండురంగరాజు తెలిపారు. సోమవారం హెచ్‌ఎం నరేంద్ర అధ్యక్షతన వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్, యోగాతో పాటు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, సంధ్యానాయక్, హనుమన్న, ఆంజినేయులు, రంగస్వామి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గోనెగండ్ల: ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహాదేవ్ డిమాండ్ చేశారు. గోనెగండ్లలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరహార దీక్ష సోమవారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్‌లలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ అమలవుతున్నప్పుడు ఎస్సీల్లోని 59 ఉప కులాల్లో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ ఎందకు ఉండదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత మాట తప్పిందని మండిపడ్డారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మారెప్ప, రవి, ప్రభు, రాజశేఖర్, సామేల్, నరసింహుడు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంక్షేమానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాతాశిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయింపు జరుగుతోందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం అమరావతిలోని వెలగపూడి శాసనసభ కమిటీ హాల్ ఆవరణంలో మహిళా, శిశు, వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. కమిటీ సభ్యురాలైన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఈ సమావేశంలో మాట్లాడుతూ.. నాడు–నేడు కార్యక్రమం క్రింద అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించడంతో పాటు, ఆయా కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాటు జరిగిందన్నారు. టేక్ హోం రేషన్ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలకు ఇంటివద్దకే సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలి



ర్యాలీగా వెళ్తున్న రైతు సంఘం నాయకులు

దేవనకొండ: మండలంలోని హంద్రీ–నీవా కాలువల ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందేవరకు పోరాడుదామని, అందుకు రైతులందరూ సంఘటితమై ఉద్యమించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి కోరారు. గుండ్లకొండ, హంద్రీనీవా కాలువల వద్ద స్లూయిజ్ ఏర్పాటు చేసి పి.కోటకొండ, మాచాపురం గ్రామాల వరకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం గుండ్లకొండ నుంచి నేలతలమరి మీదుగా దేవనకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో వర్షాలు లేక పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేలు చొప్పున పంట నష్ట పరిహారం అందించాలన్నారు. అలాగే ప్రతిరైతుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు సంఘం నాయకులు అశోక్, యూసుఫ్‌బాషా, ఓంకార్, శ్రీనివాసులు, బజారి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



రాజశేఖరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన పుల్లగుమ్మి జెడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు రాజశేఖరరెడ్డిని పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది ఘనంగా సన్మానించారు. సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం సుభాషిణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాయుడు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, బహుమతులు అందించి అభిమానం చాటుకున్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. తమ పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి అవార్డు పొందడం గర్వంగా ఉందన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ అవార్డు పొందడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఉపాధ్యాయులు జోసెఫ్, నాగేశ్వరరెడ్డి, మురళీధర్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు, ఈ–కేవైసీ తప్పనిసరి



రామళ్లకోట ఆర్బీకేలో ఈ–కేవైసీ నమోదును పరిశీలిస్తున్న ఏఓ అక్బర్‌బాషా

వెల్దుర్తి: రైతు భరోసా, పంట నష్ట పరిహారం, పంట రుణాలపై సున్నా వడ్డీ, కనీస మద్దతు ధరపై దిగుబడుల అమ్మకాలు, ఇతరత్రా ప్రభుత్వ పథకాల అర్హతకు ప్రతి రైతు తాము సాగు చేసిన పంటల వివరాల నమోదు, ఈ–కేవైసీ తప్పనిసరి అని ఏఓ అక్బర్‌బాషా సూచించారు. ఆయన సోమవారం మండల పరిధిలోని రామళ్లకోట గ్రామంలో సెక్రటరీ వెంకటేశ్‌నాయక్, ఆర్బీకే వీహెచ్‌ఏ సాంబశివుడు ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పంట నమోదు, ఆర్బీకేలో జరుగుతున్న ఈ–కేవైసీ కార్యక్రమాలను పరిశీలించారు. ఆర్బీకేలో రైతులతో సమావేశమై ఏఓ మాట్లాడుతూ.. పంట నమోదుకు ఈనెల 15వ తేదీ, ఈ కేవైసీకు ఈనెల 19వ తేదీ ఆఖరు అన్నారు. రైతులు దూర ప్రాంతాలలో ఉన్నట్లయితే ఆర్బీకే సిబ్బందిని ఫోన్‌లో సంప్రదించి ఓటీపీ ద్వారా సైతం ఈ–కేవైసీ చేయించుకోవచ్చన్నారు.

బంద్‌ను పట్టించుకోని ప్రజానీకం



పత్తికొండలో యథావిధిగా ప్రజా కార్యకలాపాలు



ఎమ్మిగనూరు బస్టాండ్‌లో ఉదయం బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సులు

ఎమ్మిగనూరుటౌన్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్, రిమాండ్‌కు నిరసనగా టీడీపీ ఇచ్చిన బంద్ ఎమ్మిగనూరులో ప్రజా స్పందన లేక విఫలమైంది. ఉదయం నుంచి ఆర్టీసీ బస్సులు డిపో నుంచి బస్టాండ్‌లో ప్రయాణికులతో యథావిధిగా బయలుదేరివెళ్లాయి. ఉదయం 10 గంటల తరువాత ఆ పార్టీ శ్రేణులు బస్ డిపో ప్రాంగణం వద్ద నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని దుకాణాలు యథావిధిగా తెరుచుకోవడంతో వ్యాపారాలు మాములుగా జరిగాయి. ప్రజానీకం బంద్ పిలుపును పట్టించుకోలేదు.

ఆలూరు రూరల్: ఆలూరు నియోజకర్గంలో సోమవారం బంద్ ప్రభావం కనిపించలేదు. రోజు మాదిరిగానే వ్యాపారస్తులు తమ వ్యాపారాలు కొనసాగించారు. షాపింగ్ కాంప్లెక్సులు, షోరూంలు, దుకాణాలు రోజువారీ కార్యకలాపాలు సాగించారు. 144 సెక్షన్ విధించడంతో ఆయా మండలాల పరిధిలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. టీడీపీ ఆలూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ కోట్ల సుజాతమ్మ, మాజీ ఇన్‌చార్జ్‌లు వీరభద్ర గౌడ్, వైకుంఠం శివ ప్రసాద్‌లను ఇళ్లకే పరిమితం చేశారు. దీంతో మరెక్కడా టీడీపీ నేతలు రోడ్లపైకి వచ్చిన దాఖలాలు లేవు.

చిప్పగిరి: మండలంలో టీడీపీ బంద్‌కు స్పందన కరువైంది. బస్సు సర్వీసులు, పాఠశాలలు, వ్యాపార కార్యకలాపాలు యథావిదిగా నడిచాయి. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్‌ఐ రమేష్‌బాబు గట్టి బందోబస్తు నిర్వహించారు.

పత్తికొండ రూరల్: టీడీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు నాయకులు చేపట్టిన బంద్ ప్రభావం సోమవారం పత్తికొండలో ఏమాత్రం కనిపించలేదు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని ప్రధాన రోడ్డు గూండా ర్యాలీ చేస్తూ హడావుడి చేసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పట్టణ శివార్లలో రోడ్లపై టైర్లు వేసి నిప్పుపెట్టి వాహనాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రాకపోకలను పునరుద్ధరించారు. వ్యాపారులు తమ దుకాణాలు యథావిధిగా తెరుచుకున్నారు. సోమవారం సంత కూడా మామూలుగానే కొనసాగింది. బస్సు సర్వీసులు కూడా తిరిగాయి.

తుగ్గలి: టీడీపీ ఇచ్చిన బంద్ ప్రభావం మండలంలో ఏమాత్రం కనిపించలేదు. సోమవారం అన్ని కార్యకలాపాల నిర్వహణతో పాటు, బస్సులు, ప్రవేటు వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగించాయి. పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తుగ్గలి, జొన్నగిరి ఎస్‌ఐలు మల్లికార్జున, రామాంజనేయులు, పోలీసు సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు చేపట్టారు. బంద్ చేసేందుకు వచ్చిన వివిధ గ్రామాల టీడీపీ నాయకులను పోలీసులు ఆయా స్టేషన్లకు తరలించారు.

మద్దికెర: మండలంలో టీడీపీ బంద్ ప్రభావం ఏమాత్రం కనిపించలేదు. మండలంలోని గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రిజ్వాన్ మహమ్మద్ టీడీపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, బస్సులు, హోటళ్లు, ఆటోలు యథావిధిగా నడిచాయి.

వైఎస్సార్ బీమా నిరుపేదలకు వరం

హొళగుంద: మండల పరిధిలోని ఇంగళదహాళ్ గ్రామానికి చెందిన పింజరి దస్తగిరి (35) అనారోగ్యంతో మరణించాడు. సోమవారం అతని భార్య కాదిరమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు నగదును సర్పంచ్ ప్రభావతమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు ప్రహ్లాదరెడ్డి చేతుల మీదుగా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, వలంటీర్ మాబు అందజేశారు. వైఎస్సార్ బీమాలో మృతుడి భార్య నామినీగా ఉండడంతో ఆమెకు ఈ నగదును అందజేస్తూ.. త్వరలో మిగతా సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ధైర్యంగా ఉండాలని అండగా ఉంటామని బాధిత కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు.

కారు, ఆటో ఢీకొని నలుగురికి గాయాలు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్నహుల్తి గ్రామ సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో సోమవారం ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. అనంతపురానికి చెందిన నరసింహులు కుటుంబ సభ్యులు కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకుని కారులో తిరిగి వస్తున్నారు. ఈ కారు అదుపుతప్పి పత్తికొండ నుంచి ఆదోనికి వెళ్తున్న హోసూరుకు చెందిన ప్రయాణికుల ఆటోను ఢీకొంది. ఆటోలో ఉన్న ఉమ్మి, రేష్మ, కారులో ప్రయాణిస్తున్న నరసింహులుతో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

హొళగుంద: ఆత్మహత్యకు ప్రయత్నించిన నాగరకన్వి గ్రామానికి చెందిన చాకలి పరమేష్ (35) అనే వ్యక్తి కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం విలేకరులకు తెలిపారు. మద్యానికి బానిసైన పరమేష్ మద్యం తాగేందుకు తన భార్య డబ్బులు ఇవ్వలేదని ఈ నెల 9న పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం బళ్లారి ఓపీడీలో చేర్పించారు. కోలుకోలేక ఆదివారం రాత్రి పరమేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య ఈరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



చెన్నంపల్లిలో సుంకులమ్మ ఆలయం వద్ద ప్రతిష్ట పూజలో పాల్గొన్న గ్రామస్తులు

తుగ్గలి: చెన్నంపల్లిలో దేవతా విగ్రహ ప్రతిష్టాపనోత్సవాన్ని సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చరణల మధ్య సుంకులమ్మ, ఆంజనేయ స్వామి, బొడ్రాయి, ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. గ్రామస్తులు దేవతామూర్తులను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కమనీయం సిద్ధేశ్వర స్వామి రథోత్సవం





ఆలూరులో సిద్ధేశ్వర స్వామి రథాన్ని లాగుతున్న భక్తులు, ప్రత్యేక పూజలందుకున్న సిద్ధేశ్వర స్వామి

ఆలూరు రూరల్: శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకుని ఆలూరు గ్రామంలోని కోట వీధిలో కొలువైన శ్రీ సిద్ధేశ్వర స్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం కమనీయంగా సాగింది. ఉదయం నుంచి ఆలూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు ప్రత్యేక వంటలు చేసుకుని స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 6.45 నిమిషాలకు ఎదురు బసవన్న గుడి వరకు భక్తుల నడుమ రథోత్సవాన్ని లాగారు. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాదాలు పంచిపెట్టారు. రథోత్సవం సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముస్లింల అభ్యున్నతే లక్ష్యం



ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

ఎమ్మిగనూరుటౌన్: ముస్లింల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆ మేరకు వారికి సంక్షేమ పథకాలు అమలుచేయడంతో పాటు రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి 11వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో ముస్లింల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డిలను సత్కరించారు. అదే వార్డుకు చెందిన పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివంగత నేత వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే వాటిని సీఎం వైఎస్ జగన్ కొనసాగిస్తున్నారన్నారు. దీంతో విద్యా పరంగా ఆర్థికంగా, ఉద్యోగాల్లో ముస్లింలు లబ్ధిపొందుతున్నారన్నారు. పేద ముస్లిం యువతుల పెళ్లికి షాదీ తోఫా కింద రూ.లక్ష ఆర్థిక సహాయంతో పాటు విద్యకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో 8 మంది ముస్లింలకు కౌన్సిలర్ టికెట్‌లు ఇచ్చామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, కో–ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్‌తో పాటు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర స్వామి ఊరేగింపు



బసవేశ్వర స్వామి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

నందవరం: నందవరం ప్రజల ఆరాధ్య దైవం, లింగాయతీల ఇలవేల్పు బసవేశ్వర స్వామి పల్లకీ సేవ, ఊరేగింపు సోమవారం కనులపండువగా సాగింది. శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో డోలు, సన్నాయి, భజా భజంత్రీల నడుమ స్వామివారి పల్లకీ సేవను భక్తులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి తెల్లవారుజాము నుంచి జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకు పూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పిండి వంటలతో ధూప, దీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారిని పల్లకితో పాటు అశ్వానికి ప్రత్యేకాలంకరణ గావించి, మహిళలు కలశాలతో పురవీధుల్లో నందికోలు సేవ, భాజా భజంత్రీలతో అగంరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్ స్వామి పల్లకి సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వైభవంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

తుగ్గలి: శ్రీ కృష్ణాష్టమి వేడుకల ముగింపు కార్యక్రమాన్ని జొన్నగిరిలో వైభవంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామంలో ఈనెల 6వ తేదీ శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని కృష్ణుడి ప్రతిమను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు సోమవారం పూజలనంతరం స్వామిని ప్రత్యేక పల్లకీపై కొలువుంచి వీధులగుండా మేళ తాళాలతో ఊరేగించారు. మహిళా భక్తులు, బాలలు సైతం పల్లకీ మోస్తూ సాగారు. సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దిబ్బలింగేశ్వర స్వామి ఉత్సవం



దిబ్బలింగేశ్వరస్వామి ఉచ్చాయాన్ని లాగుతున్న భక్తులు

హాలహర్వి: మండలంలోని గూళ్యం దిబ్బలింగేశ్వర స్వామి ఉత్సవాలను సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆంధ్ర నుంచే గాక కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం భక్తుల జయజయ ధ్వనుల మధ్య దిబ్బలింగేశ్వర స్వామి వారి ఉచ్చాయాన్ని లాగారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ నాగేంద్ర ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

చిప్పగిరి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ మండల ప్రజలకు సూచించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినతులు పరిశీలించి తగిన పరిష్కారాలు చూపుతామన్నారు. ఎంపీడీఓ కొండయ్య, ఎంఈఓ రాజ్యలక్ష్మి, ఏఓ విజయ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.